ప్రజాశక్తి

మంగళవారం 29 జులై 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇళ్ల పట్టాలివ్వాలి

కృష్ణా కరకట్ట ఇళ్ల పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కృష్ణా కరకట్ట ప్రాంత వాసులు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలోని కృష్ణా కరకట్ట ప్రాంత వాసులైన రణదివేనగర్, తారక రామానగర్, భూపేష్ గుప్తా నగర్, రామలింగేశ్వరనగర్ ప్రజలు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎఒ శ్రీనివాసరెడ్డికి ప్రజలందరూ తీసుకొచ్చిన వెయ్యికి పైగా అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కృష్ణా రిటైనింగ్ వాల్‌ను సాధించుకున్న విధంగానే ఉమ్మడిగా పోరాడి ఇళ్ల రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కష్ణా కరకట్టపై ఐదు దశాబ్దాల నుండి ప్రజలు నివాసం ఉంటున్నారని, వరదల సందర్భంగా తీవ్రంగా నష్టపోయినా, ఎన్నో సంవత్సరాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అక్కడే నివసిస్తున్నారని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రదేశంలో వరద వచ్చే అవకాశం లేదని, పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఏం అడ్డంకి వచ్చిందని ప్రశ్నించారు. జిఒ 30 ప్రకారం ఆక్రమిత స్థలాలకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఇటువంటి పరిస్థితుల్లో కష్ణా కరకట్ట ప్రాంత ఇళ్లకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కృష్ణా కరకట్టకు అవతలి వైపు మంత్రులు, పెద్ద నేతలు, నాయకులు ఇళు కట్టుకుని నివసిస్తున్నారని, పేదలకు మాత్రం పట్టాలు ఇవ్వడంలేదని అన్నారు. విజయవాడలో మూడు సార్లు గెలిచిన ప్రజాప్రతినిధులు తమ పదవులను దేనికి ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు. పెద్దోళ్లకు నగరంలో ప్రభుత్వ స్థలాలు (మిగతా 2లో)



దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న దుర్గగుడి ఇఒ శీనానాయక్

సెప్టెంబర్ 22 నుంచి దసరా మహోత్సవాలు

- అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు నిర్వహణ
- దుర్గగుడి ఇఒ శీనానాయక్
- ఆహ్వాన పత్రిక విడుదల

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వికె శీనానాయక్ తెలిపారు. దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం ఇఒ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా (మిగతా 2లో)



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

జిఒ 137ను రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

- సిపిఎం రాష్ట్ర నేత బాబురావు హెచ్చరిక
- విజయవాడ పాత బస్టాండ్ వద్ద జిఒ కాపీలు దహనం

ప్రజాశక్తి - విజయవాడ : విలువైన ఆర్‌టిసి స్థలాన్ని లూలూ బహుళజాతి కంపెనీకి ధారాదత్తం చేస్తూ విడుదల చేసిన 137 జీఓను రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం లూలూ మాల్‌కు విజయవాడ పాత బస్టాండ్ ఆర్‌టిసి స్థలాన్ని, గవర్నరుపేట, విద్యాధరపురం డిపోల స్థలాలను కట్టబెడుతూ ఇచ్చిన జీఓ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఎం సెంట్రల్, పశ్చిమ, తూర్పు సిటీల కార్యదర్శులు బి.రమణారావు, బోయి సత్యబాబు, పి.కష్ణ, నగర నాయకులు కె.దుర్గారావు, ఇ.వి.నారాయణ, బి.చిన్నారావు, సూరిబాబు, నాగేశ్వరరావు, కె.రమణ పాల్గొన్నారు.

... ప్రధాన వార్త మెయిన్‌లో

పార్కింగ్, షాపుల లీజుల అంశాలు వాయిదా

స్టాండింగ్ కమిటీలో 21 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి-విజయవాడ : పద్మావతి ఘాట్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసే కాంట్రాక్ట్ అంశం వాయిదా పడింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అధ్యక్షతన సోమవారం నూతన సభ్యులతో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆర్థికపరమైన పలు విలువైన అంశాలైనా... స్టాండింగ్ కమిటీ నూతన సభ్యులు కావడం, అంశాలపై సభ్యులతోపాటు ముఖ్యలకు సైతం సరైన అవగాహన లేకపోవడంతో చర్చకు అంతగా ప్రాధాన్యతనిచ్చినట్లుగా లేదని తెలుస్తుంది. అజెండాలోని 24 అంశాల్లో మూడు అంశాలు మినహా అన్నీ ఆమోదం పొందాయి. పద్మావతి ఘాట్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఏడాది పాటు పార్కింగ్ ఫీజు వసూలు కాంట్రాక్ట్‌కు షేక్ నదీం అహ్మద్ అనే వ్యక్తి సింగిల్ టెండర్ దాఖలు చేశాడు. టెండర్ కం బహిరంగ వేలంలో సీల్డ్ టెండర్‌లో రూ.3.55 లక్షలు కోడ్ చేసిన విషయమై చర్చను సమావేశం వాయిదా వేసింది. ఐజిఎంసి స్టేడియంలోని షాపు నెంబర్ 26 (ఎస్‌టి), 47 (ఎస్‌సి) షాపులను లీజుకిచ్చే అంశం వాయిదా పడింది. షాపు నెంబర్ 26కు ఏడుగురు, షాపు నెంబర్ 47కు ఎనిమిది మంది టెండర్ దాఖలు చేశారు. బహిరంగ వేలంలో షాపు నెంబర్ 26కు గరిక అమృత్‌కౌర్ రూ.35.80 లక్షలు, అలాగే షాపు నెంబర్ 47కు కనపర్తి కోటయ్య రూ.32 లక్షలు హెచ్చుగా కోట్ చేశారు. ఈ షాపులను మూడేళ్లపాటు లీజుకు ఇచ్చే అంశం వాయిదా పడింది. అలాగే బ్రహ్మానందరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నెంబర్లు 6, 13, 9, 14, 27 లీజు అంశం కూడా వాయిదాపడింది. సర్కిల్-1 పరిధిలోని 41వ డివిజన్‌లో సభాపతి రోడ్డును రూ.47.05 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ చేసిన ప్రతిపాదన ఆమోదం పొందింది. 34వ డివిజన్ ఐదో లైన్ బిటి రోడ్డు విస్తరణ, పేవర్ బ్లాక్‌లు వేయాలని స్థానిక కార్పొరేటర్ చేసిన ప్రతిపాదనపై రూ.38.59 లక్షల అంచనా విలువైన అంశాన్ని ఆమోదించారు. 2016లో కృష్ణా పుష్కరాలు జరిగిన సమయంలో ఘాట్ నిర్మాణం నిమిత్తం తొలగించిన ఇళ్లు, రామలింగేశ్వర్‌నగర్ నుంచి కృష్ణలంక వరకు కృష్ణానది ఒడ్డున నిర్మించిన రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో తొలగించిన ఇళ్ల అసెస్‌మెంట్లు, 2018 కుళాయి మేళా సమయంలో డబ్బులుకట్టి, కనెక్షన్లు పొందని సర్కిల్-3 ఇంజినీరింగ్ సెక్షన్ నీటి కుళాయి కనెక్షన్లు, మీటర్ కనెక్షన్లు, సీవరేజ్ కనెక్షన్లకు సంబంధించి పాత పన్నుతోపాటు కొత్త పన్ను (రెండు నీటి పన్నులు) (మిగతా 2లో)



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పతనం తప్పదు

- ప్రజా సదస్సులో వేదిక కన్వీనర్ నరసింహారావు

ప్రజాశక్తి-కంకిపాడు

ప్రజా వ్యతిరేకతను పట్టించుకోకుండా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్న కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని పలువురు వక్తలు అన్నారు. స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలపై విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తాడిగడప మున్సిపల్ ప్రాంత విద్యుత్ వినియోగదారుల ప్రజా సదస్సు స్థానిక కార్మిక భవనం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా కన్వీనర్ వై.నరసింహారావు మాట్లాడుతూ (మిగతా 2లో)



మాట్లాడుతున్న నరసింహారావు

'సృష్టి' ఆస్పత్రికి తాళాలు

- అందుబాటులో లేని వైద్య సిబ్బంది
- రికార్డులు మాయం
- విచారించి చర్యలు తీసుకుంటాం : డిఎంఅండ్‌హెచ్‌ఒ

వార్త మెయిన్‌లో



స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పతనం తప్పదు

గత వైసిపి పాలనలో తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్ల వ్యవస్థను, ట్రూ ఆప్ ఛార్జీలను రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుందన్నారు. మోడీ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తూ రాష్ట్రం మొత్తాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అదాని కంపెనీకి కోట్లు దోచిపెట్టడానికి పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఎపి కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వ్యవస్థను గత ప్రభుత్వ హయాంలో వ్యతిరేకించిన ఇప్పటి ప్రభుత్వం నేడు కొనసాగించడం దారుణమన్నారు. దీనికి తోడు ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలకు దోచుకుంటున్నారని విమర్శించారు. కాశీం అధ్యక్షతన జరిగిన సదస్సులో వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పంచకర్ల రంగారావు, లక్ష్మీనారాయణ, ఈసం శ్రీనివాసరావు, పాతాళ లక్ష్మి, సరళ, ప్రసన్న, ఆర్టీసీ శ్రీనివాసరావు, మున్నంగి నరసింహారావు, మోతుకూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్కింగ్, షాపుల లీజుల అంశాలు వాయిదా

వస్తున్నందున పన్నులు రద్దు చేయాలని బాధితుల కోరిన దానిపై పన్నులను రద్దు చేస్తూ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. వసూలుకు సాధ్యం కాని కుళాయి కనెక్షన్లు 452కు సంబంధించి రూ.73,63,607, అలాగే వాటర్ మీటర్ టాప్ కనెక్షన్లు 152 కు సంబంధించి రూ.25.02 లక్షలు, 59 యుజిడి కనెక్షన్లకు సంబంధించి రూ. 16.80 లక్షలు, మొత్తం 663 అసెస్మెంట్ల డిమాండ్ మొత్తం రూ.1,15,45,935 రద్దు చేస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. విఎంసి హెడ్ వాటర్ వర్క్స్‌కు అవసరమైన 300 టన్నుల ఆలమ్ (పటిక) కొనుగోలు కోసం ప్రతిపాదించిన రూ.44.03 లక్షల అంచనా మొత్తాన్ని ఆమోదించింది. సర్కిల్-2 పరిధి 30వ డివిజన్‌లోని బుడమేరు కాల్వగట్టున బుడమేరు వంతెన నుంచి డిపి స్టేషన్ వరకు సుందరీకరణ, అభివృద్ధికి అయ్యే రూ.46.90 లక్షల అంచనా వ్యయాన్ని సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు తీర్మానించింది.

మొదటిపేజీ తరువాయి

రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇళ్ల పట్టాలివ్వాలి

ఇస్తుంటే మాట్లాడరని, పేదల పట్టాల గురించి నాయకత్వాన్ని అడగరని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇచ్చేంత వరకు ప్రజలను కలుపుకొని సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు. కృష్ణా నది అటువైపుగా ఉన్న ప్రాంతంలో అక్కడి ఎంఎల్ఏ 700 ఇళ్లకు రెగ్యులరైజేషన్ చేస్తూ రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చారని, రిటైనింగ్‌వాల్ ఉన్న ఈ ప్రాంతంలో మాత్రం పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ ప్రాంతంలో మూడు సార్లు ఎంఎల్ఏగా గెలిచిన ప్రజాప్రతినిధిని అనేక సార్లు ప్రజలు ప్రశ్నించినా స్పందించడం లేదన్నారు. ప్రజలు ఆందోళనకు సిద్ధమైన తరువాత తాత్సారం చేస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వచ్చిన సందర్భంలో ఇక్కడి ప్రజల ఓట్ల కోసం పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఒక ఎంఎల్ఏకు సాధ్యమైనది మరో ఎంఎల్ఏకు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కష్టా కరకట్ట ప్రాంత నాయకులు కోరాడ రమణ, తమ్మిన చంద్రశేఖర్, బత్తుల చిన్నారావు, ఎన్.నాగేశ్వరరావు, గురుమూర్తి, వరప్రసాద్, రవీంద్ర, కోటేశ్వరరావు, మీరాభి, ఆదిలక్ష్మీ, జాన్‌బి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 22 నుంచి దసరా మహోత్సవాలు

ఇతర రాష్ట్రాలు, దేశవిదేశాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చే అవకాశం ఉందన్నారు. సాధారణ యాత్రికులకు అమ్మవారి దర్శనం త్వరగా జరిగేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని, ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివ ప్రసాద్ శర్మ మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు 11 రోజుల పాటు 11 అవతారాల్లో యాత్రికులకు దర్శనమిస్తారన్నారు. 22న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 23న శ్రీ గాయత్రీ దేవి, 24న శ్రీ అన్నపూర్ణాదేవి, 25న శ్రీ కాత్యాయని దేవి, 26న శ్రీ మహాలక్ష్మీ దేవి, 27న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి, 28న శ్రీమహా చండీ దేవి, 29న మూలా నక్షత్రం రోజున శ్రీ సరస్వతీ దేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న శ్రీ మహిషాసురమర్ధినీ దేవి, అక్టోబర్ 2న విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. రెండో తేదీ విజయదశమి రోజున ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్.దుర్గా ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు చింతపల్లి ఆంజనేయ గణాపాటి, వేదపండితులు మహర్షి పాల్గొన్నారు.

మధుసూదన్‌రావు సేవలు చిరస్మరణీయం



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : జీవిత బీమా సంస్థలో ఉద్యోగిగా మచిలీపట్నం వచ్చిన మధుసూ దన్‌రావు ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం మధుసూ దన్‌రావు స్మారక భవనంలో ఆయన 33వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు ఎస్ ధనుంజయరావు, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై నరసింహారావు మాట్లాడుతూ మధుసూదన్ రావు స్ఫూర్తితో జాతీయస్థాయి కార్మిక సంఘాల నాయకులుగా ఎదిగిన వ్యక్తులు చాలామంది ఉన్నారని గుర్తు చేశారు. మచిలీపట్నం ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నడిపించి వందలాది మందిని ఆకర్షించి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాది వేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగులు ఎస్ ధనుంజయ రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యూనియన్ నాయకుడిగా మధుసూదన్‌రావు ఎంతో కృషి చేశారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కిషోర్, కెవిపిఎస్ నాయకులు చీకటి రాజేష్, ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగులు కోటేశ్వరరావు రాధాకృష్ణమూర్తి టి చంద్రపాల్ తదితరులు ప్రసంగించారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

దప్పు కళాకారులకు రుణాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డప్పు కళాకారులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర చర్మ కార సేవా సంఘం ఉపాధ్యక్షుడు. బుల్లా కింగ్ త్యాగరాజుమాదిగ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్‌కు వినతి పత్రం అందజేశారు. గుడ్లవల్లేరు మండలంలోని 40 సంవత్సరాల దాటిన చర్మకార్లకు.. డప్పు కళాకారులకు .. మాదిగ కార్పొరేషన్, లిడ్ క్యాప్ కార్పొరేషన్ రుణాలు మంజూరు కాలేదని తెలిపారు. మండలం సుమారు వెయ్యి మంది చర్మకారులు, డప్పు కళాకారులు.. పొట్టకూటి కోసం జాతి బిడ్డలుగా కుటుంబం జీవన ఉపాధి ద్వారా జీవిస్తూ ఉన్నారని అన్నారు. మాదిగ కార్పొరేషన్, లిడ్ క్యాప్ కార్పొరేషన్. బ్యాంకు సహాయ ద్వారా గుడ్లవల్లేరు మండలంలో ఉన్న చర్మకారులకు డప్పు కళాకారులకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు ఋణం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కందేటి నాగరాజు, గోర్లమూడి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఆటో నగర్ నాలుగో రోడ్డులో టింకరింగ్ వర్క్ చేస్తూ ఉండగా మహమ్మద్ షబ్బీర్‌కు ప్రమాదవశాత్తు తన కుడి చేయి గూడ జారి నరం కట్ అయ్యింది. సోమవారం ప్రమాదానికి గురైన కార్మికునికి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆటోనగర్ గుడివాడ ఆధ్వర్యంలో పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, ఉపాధ్యక్షులు బొబ్బరపల్లి ఆంజనేయులు, నాయకులు షేక్ మొహిద్దిన్ భాషా, కల్వకుంట నాగరాజు, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్టేడియం షాపుల అద్దెదారుల అధ్యక్షుడిగా నందకిషోర్

ప్రజాశక్తి - గుడివాడ : నందమూరి తారకరామారావు స్టేడియం షాప్స్ అద్దెదారుల నూతన కమిటీ అధ్యక్షుడిగా పాలెపు నందకిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఆదివారం రాత్రి స్టేడియం షాప్స్ అద్దెదారుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జవ్వాజీ గంగరాజు, అధ్యక్షుడిగా పాలెపు నందకిషోర్, వైస్ ప్రెసిడెంట్లుగా శీగు సత్యనారాయణ, కూరళ్ళ రాజేష్‌మాదవ్, సెక్రటరీగా అచంట వెంకటరత్నం, జాయింట్ సెక్రటరీగా దూరడ్ల శివకృష్ణ, ట్రెజరర్‌గా ఆత్మకూరి శ్రీనివాస్‌లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు 7గురును ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను కొత్త మురళీ, పొట్లూరి కృష్ణారావు, సనకా సుబ్బారావు, గాదిరెడ్డి సత్యనారాయణ, పలువురు అభినందించారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

ఫార్మర్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారిణి జ్యోతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఫార్మర్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా ఉద్యానాధికారి జ్యోతి సూచించారు. సోమవారం మచిలీపట్నంలో మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్ ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా జిల్లా ఉద్యానాధికారి జ్యోతి మాట్లాడుతూ యాప్ వినియో గాన్ని రైతులకు తెలియజేసి ప్రోత్సహించాలని, అనేక మంది రైతులను ఈ యాప్‌లో నమోదు చేయాలని విహెచ్ ఏ ఎస్, హెచ్ఓలకు సూచించారు. రైతులందరు గూగుల్ ప్లే స్టోర్ నుండి ఫార్మర్ చాట్ యాప్ ను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ నుండి కమలాకర్ వేముల ప్రసంగిస్తూ, డిజిటల్ గ్రీన్ చేపడుతున్న కార్యక్రమాలపై, ఉద్యాన శాఖతో కొనసాగుతున్న భాగస్వామ్యంపై అవగాహన కలిగించారు. వాతావరణ సమాచారం, మార్కెట్ సమాచారం, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై సలహాలు కూడా ఇందులో భాగంగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు ఉద్యాన అధికారులు , గ్రామ ఉద్యాన సహాయకులు గైడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వారు పాల్గొన్నారు.

విద్యాలయాల పవిత్రతను కాపాడడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రజాశక్తి చల్లపల్లి.ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలపై విచ్చల విడిగా వివిధ రకాల నోటీసులు, పోస్టర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అధికారులను కోరారు. చల్లపల్లి మండలం, లక్ష్మీపురం నాడు-నేడు ప్రాథమికోన్నత పాఠశాల గోడపై పాఠశాల వాతావరణం దెబ్బతీసేలా పలురకాల పోస్టర్లు అంటించటం తీవ్ర ఆవేదన గురిచేసిందన్నారు.ప్రభుత్వ కార్యాలయాలపై పోస్టర్లు అంటించే ధైర్యం ఎవరూ చేయరని,కేవలం ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న చిన్నచూపు వైఖరి కారణంగానే ఈ విధంగా గోడలను పాడు చేస్తున్నారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల గోడలపై నోటీసులు అంటించకుండా ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-పామర్రు (మొవ్వ) : నేటి సమాజంలో చిన్నపిల్లలపై,మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను నివారించడానికి మహిళా చట్టాల పట్ల మహిళా పోలీస్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని పామర్రు సిఐ వి. సుబాకర్ అన్నారు. సోమవారం కూచిపూడి పోలీస్ స్టేషన్లో మహిళా పోలీస్ సిబ్బందికి చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణగా ఉన్నశక్తి యాప్, పోక్సు చట్టాలు,112 కాల్స్, సైబర్ నేరాలు మొదలైన వాటి గురించి విద్యార్థినీలకు, మహిళలకు గ్రామ, వార్డు స్థాయిలో అవేర్నెస్ తీసుకురావడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి ఎస్సై విశ్వనాద్ సిబ్బంది పాల్గొన్నారు.

కాటూరు పిఎసిఎస్ పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి ఉయ్యూరు : రైతులకు మెరుగైన సేవలందించి పేరు ప్రఖ్యాతులతో పాటు ప్రభుత్వం అమలుచే స్తున్న రైతు సంక్షేమ, అభివృద్ధి పథకాలు సద్వినియోగం అయ్యేలా కృషిచేసి ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. కాటూరులో విఘ్నేశ్వర కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొని చైర్మన్ గుర్రం చంద్రశేఖర్, డైరెక్టర్లు సాంబశివరావు, ధనకోటి బాలకోటేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా రైతులకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్. మండల అధ్యక్షుడు కుటుంబ బరావు, పార్టీ నాయకులు పోతురాజు, శ్రీనివాసరావు, శరత్, రవి, ఎంపీటీసీలు అనూ ష, శ్రీలక్ష్మి, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మండల అధ్యక్షుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న విక్కుర్తి

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో పలువురిని ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. మండల పరిధిలోని గాజులవారిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖులు గాజుల మురళీకృష్ణ కుమార్తె లాస్య చిన్న వయసులో ఇటీవల మరణించారు. దీనితో విక్కుర్తి మురళీకృష్ణను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా వేకనూర్ గ్రామానికి చెందిన అందే వెంకట సాంబశివరావు(బుజ్జి) మాతృమూర్తి బసవపూర్ణమ్మ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబం వద్దకు వెళ్లి వెంకట సాంబశివరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తుంగల నారాయణ ఎర్రం శెట్టి సురేష్ న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ పులిగడ్డ చంద్ర భూపతి నాంచారయ్య రేపల్లె ఈశ్వరరావు బర్మా బుజ్జి బర్మా శ్రీనివాసరావు వి రాజా తదితరులు పాల్గొన్నారు

జయప్రదకు ఘన నివాళులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు, శ్రీవాణి మాసపత్రిక సంపాదకురాలు, శ్రీ బాలాజీ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు కొమరగిరి జయప్రద మృతిపై కృష్ణాజిల్లా మానవతా స్వచ్ఛంద సంస్థ అడ్వైజర్ ప్రముఖ సీనియర్ న్యాయవాది, లంకిశెట్టి బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు, పి. వి. ఫణి కుమార్ మాదిరెడ్డి మెహర్ బాబా లు విచారం వ్యక్తం చేశారు. ఆమె పార్థివ దేహానికి సోమవారం నివాళి అర్పించి, వారి కుమారుడు చంద్రశేఖరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నగరానికి చెందిన పలు రాజకీయ పార్టీ నాయకులు, సత్యసాయి బాబా సేవకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, జయప్రద మతదేహానికి నివాళులు అర్పించారు.

సకాలంలో ఎరువులు అందించాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వం సకాలంలో రైతు సేవ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు అందించాలని కోరుతూ మచిలీపట్నం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పేర్ని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఇంచార్జి కలక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందించారు. అనంతరం పేర్ని కృష్ణమూర్తి మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గం లో సుమారు 19. వేలు ఎకరాలలో వరి సాగు చేస్తున్న రైతులకు సకాలంలో ప్రభుత్వం ద్వారా ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సకాలంలో రైతు సేవ కేంద్రాల ద్వారా కానీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుకు కావలిసినంత ఎరువులు సరఫరా చేయలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైసీపీ రైతు విభాగం నేతలు జన్ను.రాఘవ, తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి (సుమారు 50 సంవత్సరాలు) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆత్కూరు ఎస్ఐ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ పెద్ద ఆవుటపల్లి హైవే అండర్ పాస్‌లో మూర్చ వచ్చి పడిపోగా స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా విజయవాడ ఆసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. గుర్తింపు నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆ వ్యక్తి గూర్చి ఎవరికైనా ఏదైనా సమాచారం తెలిస్తే 9491152837లో సంప్రదించాలని కోరారు.



ఎట్టకేలకు రోడ్డును సరిచేశారు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మైలవరం : గ్రావెల్ పోయాల్సిన రహదారిపై మట్టి పోయడంతో చిన్నపాటి వర్షానికి ఆ రహదారి బురద బురదగా మారడంతో రైతులు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొందుగల నుండి పంగిడికి వెళ్లే రహదారిపై గ్రావెల్ పోయాల్సి ఉంది. గ్రావెల్ పోయాల్సిన చోట 'మట్టి పోసి లక్షలు నొక్కేశారు' శీర్షికన ఈనెల 23న ప్రజాశక్తిలో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు ఎట్టకేలకు రహదారిపై వెటమిక్స్ పోశారు. తమ ఇబ్బందులను ప్రజాశక్తిలో ఎత్తిచూపి సమస్య పరిష్కారం అయ్యేలా అధికారులు స్పందించటంపై రైతులు, పొందుగల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వైద్యం కోసం వితరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కెబిఎన్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో పేద బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.41 వేలు అందజేశారు. జి.కొండూరు మండలం, వెలగలేరు గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలుడు ఎస్.హేమంత్ వీరేంద్ర బ్రెయిన్ ట్యూమర్, బోన్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికం కారణంగా వైద్యఖర్చుల కోసం ఇబ్బందిపడుతున్న హేమంత్ తల్లిదండ్రులు జోజిబాబు, జ్యోతి కె.బి.ఎన్.కళాశాలను ఆశ్రయించగా, ఎన్.ఎస్.ఎస్. విభాగం పక్షాన అతడికి ఆర్థిక సహాయం అందించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి, షైన్ కాలేజీ ప్రిన్సిపాల్ టి.నరేంద్ర, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.సాంబశివరావు, శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా గురుకులాల్లో కోతుల బెడద

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయం, కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో కోతుల బెడద ఎక్కువైపోయింది. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు ఈ విద్యాలయాల్లో కోతులు సంచారం చేస్తూ, దాడులు చేస్తూ బాలికలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో నూతనంగా అడ్మిషన్ పొందిన 5వ బాలికలు బట్టలు ఆరేసుకునే సమయంలో కోతులు వెంటబడటంతో భయంతో పరుగులు పెడుతున్న బాలికలకు బట్టలు ఆరేసుకునే తీగలు అడ్డుపడి ముఖంపై గాయాలు కావడంతో కింద పడిన విద్యార్థులపై కోతులు దాడి చేశాయి. గాయాల పాలైన బాలికలు వైద్యం కోసం ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు భయంతో వణికి పోతున్నారు.

కోతుల సమస్య పరిష్కారంలో అలసత్వం

ఈ విద్యాలయాల్లో కోతుల సమస్య పరిష్కారం చేయాలని ఇక్కడ ప్రధానోపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు ఎన్నో సార్లు అధికారులకూ, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. కానీ ఎవరూ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ విద్యాలయాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధర్మస్థలి హత్యాకాండపై దర్యాప్తు వేగవంతం

మహిళా సంఘాల ధర్నాలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : కర్నాటకలోని ధర్మస్థల హత్యోదంత ఘటనలు తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయని, పారిశుద్ధ్య కార్మికుడు విజిల్ బ్లోవర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఆధారం చేసుకుని, సిట్ బందం తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులను కటినంగా శిక్షించాలని, మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ధర్మస్థల హత్యోదంతలో ఉన్న వ్యక్తులు సంస్థలు, జరిగిన హత్యలు, నేరాల ఉదంతాలు బయటకు తీసి దోషులను కటినంగా శిక్షించాలని కోరుతూ మహిళా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ 1983 నుండి ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో అనేక మంది మహిళలు, యువతులు, బాలికలు అదృశ్యమయ్యారన్నారు. 1995 నుండి 2014వరకు పనిచేసిన మాజీ పారిశుద్ధ్య కార్మికుడు అనేకమంది అత్యాచార ఆనవాళ్లు ఉన్న బాలికల,మహిళల శవాలను తాను నేత్రావతి నదీ పరీవాహక ప్రాంతంలో పూడ్చిపెట్టానని చెప్పాడన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, ప్రగతి శీల మహిళా సంఘం, ఐద్వా, పిఒడబ్ల్యు నాయకురాలు ఆర్.గంగాభవానీ, ఝాన్సీ, పద్మ, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, బంకా ఝాన్సీ లక్ష్మి, కె.శైలజ, డి.పుష్పావతి, షకీలా పాల్గొన్నారు.



కబడ్డీ సంఘంలో వివాదాలు లేకుండా చర్యలు

కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్‌లో జరుగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు జోక్యం చేసుకుంది. మే 17న రాష్ట్ర సెక్రటరీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నుకున్న కొత్త కార్యవర్గాన్ని హైకోర్టు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇండియాలో మెడల్స్ తెచ్చుకున్న క్రీడాకారులకు సన్మానం ఉందంటూ రాష్ట్ర సెక్రటరీగా ఉన్న శ్రీకాంత్ మే 16న రాష్ట్రంలోని కొన్ని జిల్లాల ప్రెసిడెంట్, సెక్రటరీలను విజయవాడ రప్పించి మే 17న తనకు తెలియకుండా స్పోర్ట్స్ నిబంధనలకు విరుద్ధంగా కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు ప్రకటన చేసారని అన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా ఆ ఎన్నిక సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చిందని చెప్పారు. రావులపాలెంలో ఏప్రిల్ 13న జరిగిన అసోసియేషన్ మీటింగ్‌లో శ్రీకాంత్ తీసుకుంటున్న నియంతృత్వ నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని అన్నారు. ముఖ్యంగా అక్రమ సెలెక్షన్లు, తప్పుడు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ల ద్వారా జట్ల ఎంపిక, జిల్లాల ప్రాతినిధ్యంలో జోక్యం వంటి అంశాలను ఎత్తి చూపమని అన్నారు. అయినప్పటికీ శ్రీకాంత్ తన వైఖరి మార్చుకోక, తిరుగుబాటు చేస్తున్నవారిని అసోసియేషన్ నుండి తొలగించేందుకు ప్రయత్నించారని వెంకటరెడ్డి ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ జూలై 15కి ముందు 'యువ ఆంధ్ర ప్రో కబడ్డీ' పేరుతో సెలెక్షన్లు నిర్వహించడం ఎస్‌కెవై (స్కై) అనే పేరుతో రాష్ట్ర జట్టును ప్రవేశపెట్టడం కూడా కోర్టు దృష్టికి తీసుకువెళ్లమన్నారు. వాస్తవాలు నిరూపించేందుకు సమర్పించిన తప్పుడు అఫిడవిట్‌పై సంతకం చేసిన 26 మందిపై చర్యలు తీసుకోవాలని కోర్టును కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ వివాదంలో పాలుపంచుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, కబడ్డీని రాజకీయాల నుండి దూరంగా ఉంచుతూ, నైతిక విలువలు కలిగిన కమిటీతో క్రీడను ముందుకు తీసుకెళ్లేలా కృషి చేస్తామని వెంకటరెడ్డి వెల్లడించారు.



గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల ఫలితాలపై తీవ్రజాప్యం

ప్రజాశక్తి - గంపలగూడెం : వారాలు గడుస్తున్నప్పటికీ ప్రకటించాల్సిన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్ ఫలితాన్ని ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అదనపు ఉపాధ్యాయుడు కావాలంటూ, ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.అనురాధ ప్రకటన చేశారు. ఈ మేరకు ప్రకటన నిబంధనలలో భాగంగా ఈనెల 21న ఈ ఉద్యోగానికి 8 మంది హాజరైనట్లు సమాచారం. ఉన్నత విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల నుండి త్రి సభ్య కమిటీ (ముగ్గురు) హాజరై విద్యా అర్హత పత్రాలు, అభ్యర్థుల విద్యా బోధన తదితర అంశాలను పరిశీలించారు. అదే రోజు 5 గంటలకు ప్రకటించాల్సిన ఫలితాన్ని నేటి వరకు ప్రకటించకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

రాజకీయాలతో జాప్యం

గతంలో ఎప్పుడు అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలన్నా ప్రిన్సిపాల్‌తో పాటు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకొని అదే రోజు అర్హత కలిగిన అభ్యర్థికి ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చేవారు. కానీ ఇటీవల ఈ కళాశాలలో జరిగిన ఈ అంశంలో మండలం, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిలలో కొందరు అభ్యర్థులు లాబీయింగ్ చేయడంతో ఈ జాప్యం ఏర్పడిందని విశ్వసనీయ సమాచారం. విసన్నపేట, విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో జరిగిన ఇదే అంశంపై ఫలితాలు ఆరోజే వెల్లడయ్యాయి. ఇప్పటికైనా త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న పందేల నిర్వాహకులు, వాహనాలు

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జి.కొండూరు : కుంటముక్కలలో కోడిపందేలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 15 మంది పందెం రాయుళ్లను, ఇరవై నాలుగు ద్విచక్ర వాహనాలను, ఇరవై వేల ఐదు వందల నగదును, ఓ కోడిపుంజును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జి.కొండూరు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. ఈ దాడిలో జి.కొండూరు ఎస్ఐ సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఎల్‌ఒసి అందజేత

పజా శక్తి - విజయవాడ సిటీ : 43 వ డివిజన్ ఊర్మిళ నగర్ కు చెందిన పంగా వీరాంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితునికి రూ.5.21 లక్షల ఎల్‌ఒసి ఎంఎల్‌ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అందజేశారు. సోమవారం బాధితుని కుటుంబ సభ్యులకు ఈ ఎల్‌ఒసిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడారు.



నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తిరువూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు సమత అధ్యక్ష, కార్యదర్శులుగా అడ్వకేట్ కంచర్ల శశికళ, కొమ్మి నేని సహజ, లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు అధ్యక్ష, కార్యదర్శులుగా పసుమర్తి వెంకటేశ్వరరావు, చలమాల శంకరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు లెజెండ్ అధ్యక్ష, కార్యదర్శులుగా, న్యాయవాది ధూపకుంట్ల జ్వాలా నరసింహారావు, యరదేశి రామారావు నియమితులయ్యారు. ఆదివారం రాత్రి తిరువూరు కనకం రెసిడెన్సీలో లయన్స్ క్లబ్ విభాగాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధినేతలు నివృతరావు, కంచర్ల ముత్య ప్రసాదు, కుమ్మినేని రాజేష్ ఖన్నా, నాగు బండి రాజ ప్రతిరావు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్లు వేయాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఈలప్రోలు రూట్‌లో సెంటు కాలనీ వాసులు తమ కాలనీలో ఇటివల వర్షానికి పూర్తిగా రోడ్లు దెబ్బతిన్నాయని, మోకాళ్ళ లోతు బురద, పిల్లలు స్కూల్‌కి, పెద్దలు పనులకు వెళ్ళటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై, వాటర్ లైన్, వీధి లైట్లు, హాస్పిటల్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే వసంతను, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబును, వైస్ చైర్మన్ చుట్టకుదురు శ్రీనివాస్‌ను కలిసి తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మీ దేవి, బి.బాలాజీ, సూర్య, శివ, వర్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

ప్రజాశక్తి - తిరువూరు : గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించవద్దని తిరువూరు సెక్టార్ వన్ ఎస్ఐ సత్యనారాయణ కోరారు. మండలంలోని చిట్యాల గ్రామంలో సోమవారం సైబర్ నేరాలు - నేరాల నియంత్రణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కోడి పందాలు, పేకాట వంటి జూదాల జోలికి వెళ్ళవద్దని, గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అపరిచిత వ్యక్తులు పంపించే ఫోన్ కాల్స్, మెసేజ్లకు స్పందించవద్దని సూచించారు. గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గుండబోయినపాలెం, బండిపాలెం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు అధ్యక్షతన ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని బాబు చేసిన మోసాలని విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని గ్రామ నాయకులకు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు.

స్మార్ట్ మీటర్ల దోపిడీపై సంతకాలు సేకరణ



గన్నవరంలో...



మొవ్వలో...

ప్రజాశక్తి-మోపిదేవి : స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం మోపిదేవిలోని సిఐటియు కార్యాలయం లో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ .రాజశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పాల్గొని ప్రసంగించారు. స్మార్ట్ మీటర్ ల వల్ల సామాన్యులకు అధిక భారం అవుతుందని కాబట్టి, ఈ స్మార్ట్ బిగింపు మానుకోవాలని ఈ స్మార్ట్ బిగింపు వల్ల జరిగే అధిక భారం గురించి ప్రజలలోకి తీసుకొని వెళ్లి, వారి చైతన్య పరచాలని అలాగే ఆగస్టు 5 వ తేదీన విద్యుత్ ప్రభుత్వ కార్యాలయ వద్ద ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ కరీముల్లా, జిల్లా ఎంపీ ఈ ఎల్ డి. దానే సహదేవుడు, ఆటో పంచాయతీ కార్మికులు ప్రజా సంఘ నాయకులు రావి బుట్టో, రావి ప్రసాద్ రావు, కొలుసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** ప్రజల నెత్తిన విద్యుత్ బాంబు కానున్న స్మార్ట్ మీటర్ పెడితే ఊరుకోవద్దని, బలవంతంగా స్మార్ట్ మీటర్ పెట్టాలని చూస్తే పగలగొట్టాలని ప్రజావేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బుద్ధవరం పంచాయతీ పరిధిలోని రాజీవ్ కాలనీలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక నాయకులు కాట్రగడ్డ జోషి, కొండా వీరాస్వామి, మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల వల్ల కరెంట్ బిల్లులు విపరీతంగా పెరిగిపోయి, కరెంటు వాడలేని పరిస్థితి వస్తుందన్నారు. ప్రజావేదిక నాయకులు ఏసుదాసు, వెంకటేశ్వర రావు, ఆంతోని తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని, ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజావేదిక నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం అయిన ఉంగుటూరు గ్రామంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ కరపత్రాల పంపిణీ చేశారు. ప్రజా వేదిక నాయకులు రావూరి పద్దు, జుజ్జవరపు రంగారావు, ఎం.సత్యనారాయణ, కష్ణ, రంగారావు, తవిటి నాయుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** స్మార్ట్ మీటర్లు కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చేలా, ట్రూ అప్ చార్జీలు రైతులకు భారాలు పడేలా ఉన్నాయని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. మండలంలో స్మార్ట్ మీటర్లు బిగించద్దని,ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు పంచారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. శివ నాగేంద్రం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఖమ్మం కొండల బాబు, మండల నాయకులు గుడిసె సుబ్బారావు, లెనిన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసోబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీలను ఆపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు గంగాధర ప్రసాద్ అన్నారు. ఈ మేరకు డిజిటల్ మీటర్ల వినియోగంపై జరిగే అవకతవక లను వివరిస్తూ పామర్రు లో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు ప్రభుత్వం పాత మీటర్ల తొలగించి స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ఆదాని కంపెనీకి 23 లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని కల్పిస్తుందన్నారు. మీటర్ ఖరీదు 9 వేలు అయితే, 93 నెలల వాయిదాలలో డబల్ వసూలు చేస్తారని, ఆ తర్వాత మళ్లీ కొత్త మీటర్ బిగించుకోవాల్సిందే నన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి రాజు, వేము చంటి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ప్రభుత్వం వెంటనే స్మార్టు మీటర్లు బిగించడం నిలుపుదల చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 25వ వార్డులోని పెద్దఎరుకపాడు సచివాలయం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సచివాలయం అడ్మిన్‌కు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబు, ఏఐటియుసి నాయకులు చింతలూరి సత్యనారాయణ, మాల మహానాడు నాయకుడు పంతగాని సురేష్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి :** స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సొంత బజారులో కరపత్రాలు పంపిణీ చేస్తూ, స్మార్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా మద్దతు కోరుతూ సేకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వలన ప్రజలకు చార్జీలు భారం రెట్టింపు అవుతుందని, స్మార్ట్ మీటర్లు సామాన్యులకు అధిక భారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ మీర్ రిజ్వాన్ , నాయకులు కొండేటి భాస్కరరావు, సిపిఐ మండల నాయకులు ఎస్.బాలయ్య, సిపిఎం మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరిముల్లా, రైస్ సంఘం కూలీ నాయకులు పరుచూరి జనార్దన్ రావు, సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మండల వ్యవసాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బండారు కోటేశ్వరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ:**ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ మొవ్వ మండలం కోసూరు గ్రామంలో విద్యుత్ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, కోసూరు సిపిఐ శాఖ కార్యదర్శి బి. నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉయ్యూరు :** సర్దుబాటు విద్యుత్తు చార్జీల పేరుతో ప్రజలపై భారాలను వెంటనే తగ్గించాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి కీర్తి అన్నారు. సోమవారం ఉయ్యూరు టౌన్‌లో సుందరమ్మ పేటలో విద్యుత్ భారాలను తగ్గించాలి స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ ఒకపక్క నిత్యవసర సరుకుల ధరలు భారాలు ప్రజల మీద వేశారని మరోపక్క విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల మీద పెనుబారాలు వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి .రాజేష్ సుందరం పేటలో ప్రజలు పాల్గొన్నారు.



పామర్రులో...



ఉంగుటూరులో...

సాహసకు రాష్ట్రస్థాయిలో రజత పతకం



ప్రజాశక్తి-గన్నవరం : తొమ్మిదవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మోడరన్ పెంటాతలన్ ఛాంపియన్షిప్‌లో సత్తా చాటిన కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిన్న అవుటపల్లి కి చెందిన నియా సాహస అండర్ 9 మిక్సడ్ క్యాటగిరి లో అత్యుత్తమ ప్రతిభ ఘన పరిచి రజత పతకం కైకసం చేసుకుంది. ఈ సందర్భంగా నియాని ఆంధ్రప్రదేశ్ మోడరన్ పెంటాతలన్ అధ్యక్షులు వెలగపూడి ఉజ్వల్ వెండి పతకాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉజ్వల్ మాట్లాడుతూ నియా విజయ్ అతి చిన్న వయసులో పతాక విజేతగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని, నియా సాహస క్రీడలలో ముమ్ముందు బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా నియాను కష్ణా డిస్ట్రిక్ట్ మోడ్రన్ వెంటాతలన్ ప్రధాన కార్యదర్శి మరీదు నరేంద్ర, ఉపాధ్యక్షులు కోట కృష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గోగులమూడి పాల్గొని నియాకు అభినందనలు తెలిపారు

రెండు కేజీల వెండి అందజేత



ధారా పాత్ర,వెండి జటా జూఠం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మొవ్వ : గుడివాడకు చెందిన జాస్తి ఉమా మహేశ్వరరావు దంపతులు కూచిపూడి లోని గంగా కామాక్ష సమేత ఏకాంబరేశ్వర స్వామికి రెండున్నర లక్షల రూపాయల విలువ గల రెండుకేజీలు వెండితో ఏకాంబరేశ్వర స్వామికి ధారా పాత్ర, స్వామివారికి వెండి జటా జూఠం సోమవారం సమర్పించారు. పురోహితులు, దేవాలయ పాలకులు జంధ్యాల పాండురంగ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యవారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

జిల్లా ఇన్చార్జి పంచాయతీ అధికారిగా రజాఉల్లా



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా ఇంచార్జి పంచాయతీ అధికారిగా రజాఉల్లా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ వారం రోజులు పాటు వ్యక్తి గత సెలవు పెట్టడంతో మచిలీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం డి.రజాఉల్లా ను ఇంచార్జి పంచాయతీ అధికారి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఇంచార్జి కలక్టర్ గీతాంజలి శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపధ్యంలో రజాఉల్లా బాధ్యతలు చేపట్టారు.

పెరిగిన వేతనాలు అందించాలని వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 124 ప్రకారం పెంచిన వేతనాలు అందించాలని మచిలీపట్నం ఇంజనీరింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆముదాలపల్లి శంకర్, కార్యదర్శి అనుమకొండ రంగబాబు తదితరులు సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రమణ్యం పర్యవేక్షణలో సోమవారం మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ చిరువోలు సత్య వెంకట బాపిరాజుకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్హత కలిగి వత్తిపరంగా కూడా గ్రేడ్ వన్ విధులు నిర్వహి స్తున్న ఉద్యోగులు ప్రస్తుతం గ్రేడ్ 2 హోదా లోనే సెమీ స్కిల్ విభాగంలో పనిచేస్తున్నారని, వారందరినీ గ్రేడ్ వన్ కి అప్గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం నగరపాలక సంస్థలో ఐదు సంవత్సరాలు పైబడి పని చేస్తున్న వారిని గుర్తించి గ్రేడ్ వన్ ఉద్యోగులుగా పరిగణించడంతో అదే స్థాయి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సుబ్రమణ్యం, వెంకటకష్ణ, వి ఎన్ వి హనుమాన్ ప్రసాద్ సులోచన, మహేష్, బి వేణు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆధార్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం పంచాయతీ పెద్దగుడుమోటు గ్రామానికి చెందిన 21 మంది ఎస్టీలకు ఆధార్ కార్డులు మంజూరు చేసినట్లు ఇన్చార్జి తహసిల్దార్ కిరణ్మయి తెలిపారు. సోమవారం లింగారెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి శ్రీ దుర్గా చేతుల మీదగా ఆదార్ మంజూరు పత్రాలను లబ్ది దారులకు అందజేశారు. ఎస్టీల ఆధార్ సమస్యను గ్రామ సర్పంచి యర్రం శెట్టి శ్రీ దుర్గా తాసిల్దార్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆమె స్పందించి వీఆర్వోలను పంపించి విచారణ నిర్వహించి వారికి ఆధార్ కార్డు మంజూరు చేసారని శ్రీ దుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రం శెట్టి దామోదర్ రావు, వీఆర్వోలు పెనుమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అలరించిన నాట్య ప్రదర్శనలు



ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన నాట్య ప్రదర్శనలు అలరింపచేశాయి. పర్యాటక కేంద్రమైన కూచిపూడిలో మొబైల్ పాస్పోర్ట్ శిబిరం నిర్వహణ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచి పూడి నాట్య ప్రదర్శనలు రంజింప చేశాయి. ఐసీసీఆర్ తరఫున కిరణ్మయి బోనాల (హైదరాబాద్) తోపాటు శిష్య బందం ప్రదర్శించిన అంశాలు అధికారులను మైమరపింపచేశాయి. అలాగే శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు శిష్యులైన ఎం పి ఏ విద్యార్థినులు చావలి మౌనిక,కార్తిక భామాకలాపం లోని సత్యభామ ప్రవేశదరువు, తరంగం, దశావతారాలు శబ్దం ప్రదర్శించి రసజ్ఞుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కళాకారులను కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అభినందించారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సోమవారం లైంగిక వేధింపులు నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతల ద్వారా, సైగల ద్వారా, మారుపేరుతో మహిళలను, అమ్మాయిలను వేధించకూడదన్నారు. ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌పై దృష్టి సారించి చట్ట వ్యతిరేకమైన పనులకు దూరంగా ఉండాలని సాటి మహిళలను గౌరవించాలని సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి సుభాషిని, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, డాక్టర్ రాముడు, ఉమాలక్ష్మి విద్యార్థి విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి


మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి - వీరులపాడు : ఆశ వర్కర్లకు కనీస వేతనాలివ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల వీరులపాడు మండల మహాసభ వీరులపాడులోని సిఐటియు కార్యాలయంలో, సోమవారం పి.సుబ్బమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో ఆశ వర్కర్లకు పనిచేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఫోన్లు పని చేయకపోవడం వల్ల ఆశ వర్కర్లే సొంత ఫోన్లు కొనుక్కుని నెలకు సరఫరా డేటా వేసుకుని పనిచేయాల్సి వస్తుందని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాణ్యమైన ఫోన్లు, 4జి సిమ్ములు ఆశ వర్కర్లకు వెంటనే ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం వీరులపాడు పిహెచ్‌సి ఎనిమిది మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పి.సాయమ్మ, కార్యదర్శిగా ఎస్‌కె ముగ్ధంబి, కోశాధికారిగా ఎన్.భాగ్యలక్ష్మి, ఎం.శాంతాదేవి, ఎన్వి. రమణ, వి.విజయకుమారి తదితరులు ఎన్నుకున్నారు. అల్లూరు పిహెచ్‌సి నూతన కమిటీ ఆరుగురిని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.సుబ్బమ్మ, కార్యదర్శిగా సిహెచ్.అరుణ, కోశాధికారిగా కె.సంధ్య, సిహెచ్.విజయలక్ష్మి జి.తిరుమలేశ్వరి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రైల్వే టిసి ఉద్యోగం పేరుతో మోసం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని సీతారామపురానికి చెందిన చవట రాఘవేంద్ర కుమార్‌ను అనంతపురం జిల్లా అనంతపురానికి చెందిన జక్కా లక్ష్మి అనే మహిళ రైల్వే టిసి ఉద్యోగం ఇప్పిస్తానని రెండున్నర లక్షల రూపాయలు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసింది. తాను మోసపోయానని గ్రహించిన రాఘవేంద్ర కుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పట్టణ ఎస్ఐ జి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 12వ వార్డ్ ధనంబోర్డులో ప్రధానంగా ఉన్న సమస్యలు కాలువలు, వీధిలైట్లు, ముఖ్యంగా కంప చెట్లు జెసిబి ద్వారా తొలగించాలని మహిళలు కోరుతున్నారు. కాలనీలోని మహిళలపై చిన్న పిల్లలపై కోతులు దాడులు చేస్తున్నాయని, పలు సమస్యలను మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి సోమవారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే వార్డు పర్యటన చేసి సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జ శంకర్, దానబోయిన కాటమరాజు, దారెల్లి రాజు, కనపర్తి సత్యంబాబు, రంగిశెట్టి సాయి ధనం బోర్డు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి పయ్యావుల ప్రారంభోత్సవం



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో రూ.3.60 కోట్ల అభివృద్ధి పనులు ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ప్రారంభించారు. పాత బస్టాండ్ వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో పయ్యావుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మంత్రి పయ్యావుల కేశవ్ నందిగామ నియోజకవర్గంతో తనకున్న లోతైన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దివంగత నేతలు దేవినేని వెంకటరమణ, తంగి ప్రభాకరరావుతో తనకు ఉన్న స్నేహశీలి సంబంధాన్ని ఆయన ఉద్వేగంతో స్మరించారు. దేవినేని వెంకటరమణ, ధూళిపాళ్ల నరేంద్ర తను రాజకీయాలలో ఒకసారి వచ్చామని, రమణ చాలా ముందుచూపు కలిగిన వ్యక్తి అంటూ తంగిరాల ప్రభాకరరావు స్నేహశీలి, చాలా మదుస్వభి అని తీరిక దొరికితే పుస్తకంతో సహవాసం చేసేవారని రమణ ప్రభాకర రావు నియోజకవర్గంలో సూర్య చంద్రులు అంటూ వారితో ఆయనకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంత్రి పయ్యావుల కేశవ్‌ను సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, లాల్ బహాదుర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకటసత్యనారాయణ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తొర్లకొండ సీతారామయ్య, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారాలు



విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యబాబు


మైలవరంలో నిర్వహించిన సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానీపురం క్రాంబ్ వే రోడ్‌లోని సుందరయ్య గ్రంథాలయంలో 40, 41,42 డివిజన్ల సమావేశం సోమవారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తూ చేస్తున్న అన్యాయంపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 5న నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు సిపిఎం పూర్తి మద్దతు తెలియజేస్తుందని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సంతకాలు సేకరణ స్థానిక నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారెడ్డి, డివిజన్ నాయకులు కృష్ణారెడ్డి, బి.అచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం : విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారాలు మోపుతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు విమర్శించారు. కరెంటు మీటర్లు పెట్టొద్దు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని కానీ సంవత్సరంలో రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపారన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించడం వల్ల చిన్న వ్యాపారస్తులు దెబ్బతింటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, సురేష్, వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు రావుల సుబ్బారావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆర్ఆర్బి పుష్పకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వేదిక బృందం పరిశీలన



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్టీటీపీఎస్ కాలుష్యం ప్రభావిత ప్రాంతాలైన కొండపల్లి, ఇబ్రహీంపట్నం, జూపూడి, కిలేశపురం, ఫెర్రీ ప్రాంతాలు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను సోమవారం సందర్శించారు. స్థానిక బాధితులతో ముచ్చటించారు. అనంతరం ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ ప్రకాష్ మాట్లాడుతూ ఎన్‌టిటిపిఎస్ ప్రాంతాలన్నీ బూడిదతో నిండిపోయి తీవ్రమైన కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్టీటీపీఎస్ కాలుష్యం వల్ల ప్రజలు చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నట్లు చెప్పారు. ఎన్టీటీపీఎస్ పై యాష్‌తో పాటు బూడిద చెరువులో లోడింగ్ వల్ల గాలి కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల సుమారు 15 గ్రామాలకు తీవ్ర సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో ఎన్టీటీపీఎస్ యాజమాన్యం గ్రీనరీ పెంచే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రెగ్యులర్‌గా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అన్ని సౌకర్యాలతో హాస్పిటల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రజారోగ్య వేదిక పూర్తి అధ్యయనం చేసి నివేదికను ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి అందించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.కామేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.సీతారామారావు, కొండపల్లి మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరరావు, పి.కామేశ్వరరావు, శ్రీధర్, ప్రజారోగ్య వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య డే స్కాలర్ క్యాంపస్ వార్షికోత్సవం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని శ్రీ చైతన్య ఐఐటి డే స్కాలర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం కానూరు మన కళ్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. తొలుత వేడుకలను శ్రీ చైతన్య విద్యా సంస్థల కార్యనిర్వాహక ఎజిఎం మద్దినేని మురళీ కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలు ప్రతి ఏటా ఐఐటిలో జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఐఐటి, ఎన్ఐటిలో ఉత్తీర్ణత, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ ఆంజనేయులు, పలువురు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మాజీ ఎంపిటిసి సభ్యులు డాక్టర్ ఎంఏ జవహర్ జ్ఞాపకార్థం స్థానిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థినులకు అవసరం అయిన నోటు పుస్తకాలు, పెన్సిల్స్, స్టేషనరీని పంపిణీ చేసినట్లు కొండపల్లి మాజీ ఎంపిటిసి సభ్యులు ఎం ఏ హైదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీను, కౌన్సిలర్ చుట్టుకుదురు వాసు, అడపా వెంకయ్య, కుమ్మరి శ్రీను, ఏడ్లూరి హరిత, స్థానిక జనసేన పార్టీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్ పాల్గొని పుస్తకాలు పంపిణీ చేశారు.

అంగన్వాడీ కేంద్రానికి వస్తువులు

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం 2 లో ఆ గ్రామానికి చెందిన కొత్త గుండ్ల వెంకటేశ్వరరావు వరలక్ష్మి దంపతులు సహాయంతో అంగనవాడి పిల్లలకు అవసరమైన 15 బాక్సులు అందజేశారు. పాలు తాగేందుకు కప్పులు, గిన్నెలు, స్టాండ్, చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలాలకు నీరు విడుదల

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలో చెరువు నుండి క్రింది పొలాలకు లాకులు తిప్పి ఎంఎల్ఎ రాజగోపాల్ తాతయ్య నీటిని విడుదల చేశారు. మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో బుధవారం ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాల దష్ట్యా నూతన కషి చేసి చెరువుల నుండి క్రింది పొలాలకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి వనరులు సమర్థవంతంగా వినియో గించుకొని పంటల సాగు జరగాలని, ప్రతి రైతు సంతృప్తిగా వ్యవసాయం చేయాలన్నారు.

ఆర్‌డిఒకు 15 మంది నుండి ఫిర్యాదులు

ప్రజాశక్తి - నందిగామ : ప్రభుత్వ అధికారులు తమ పనితీరు ప్రజలకు అనుకూలంగా పనిచేయాలని ఆర్డిఓ కె.బాలకృష్ణ సూచించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెసిడెన్షియల్ సిస్టం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 15 మంది వివిధ సమస్యలతో వారికి ఫిర్యాదులు అందించారు. రెవెన్యూ శాఖలో 6 ఫిర్యాదులు అందాయి.

వక్ఫ్ ఆస్తులను విడిపించాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం నియోజకవర్గ పరిధిలో ఎన్నో వక్ఫ్ భూములు ఆక్రమణదారుల చేతిలో ఉన్నాయని వాటిని విడిపించి ముస్లింల సంక్షేమానికి ఉపయోగించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు హజ్రత్ సయ్యద్ షాబుఖారి ఆస్థాన పీఠాధిపతులు అల్తాఫ్ బాబా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్‌ను సోమవారం గొల్లపూడి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ముస్లిం పిల్లలు విద్య అభ్యసించి సరైన ఉద్యోగాలు రాక నిరుద్యోగు లుగా మిగిలి పోతున్నారని, విద్యాసంస్థలు, ఉపాధి కల్పించే సంస్థలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కలిసి ఇదే విషయంపై చర్చించామని ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై దృష్టిసారించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రభుత్వం నిర్మించే గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ తెలిపారు. సోమవారం గుడ్లల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో ఇమ్రాన్ , హౌసింగ్ ఎఇ సురేంద్ర మాట్లాడారు. మండలంలో 2761 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 1101 ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యాయని చెప్పారు. 819 వివిధ దశలలో ఉన్నాయన్నారు. 841 అసలు మొదలు పెట్టలేదన్నారు. వీరందరికీ ప్రభుత్వం అందించే రూ.1,80,000, అదనంగా అందించే ఆర్థిక సాయం (బీసీ, ఎస్సీ వారికి రూ50,000, ఎస్టి వారికి రూ.75,000)తో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవా లన్నారు. ఈ నిధులను ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణాలు చేసే లబ్ధిదారులు పొందేందుకు డిసెంబర్ 31, 2025 ఆఖరి తేదీలోగా ఉన్నతాధికారులు ప్రకటించారని పేర్కొన్నారు. తదుపరి రద్దు ఈ పథకం చేయవచ్చునని హెచ్చరించారు. అదే పథకం నిధులతో నూతన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించే అవకాశం ఉందన్నారు. ఇవే కాకుండా గోడలు , స్లాబ్ నిర్మాణం చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేయని వారు కచ్చితంగా ఆగస్టు 15, 2025 లోపు పూర్తి చెయ్యాలని అన్నారు.ఃష సమావేశంలో హౌసింగ్ ఏఈ ఆలపాటి సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మచిలీపట్నం ప్రాజెక్టు కమిటీ సభ్యులను నూతనంగా ఎన్నుకున్నట్లు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగత రమాదేవి తెలిపారు. సోమవారం మచిలీపట్నం బుట్టాయిపేట మధుసూ దన్‌రావు స్మారక భవనంలో మహాసభ జరిగింది. అధ్యక్షురాలుగా కే లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ నాంచారమ్మ, ట్రెజరర్‌గా టి సుజాత, ఉపాధ్యక్షులుగా ఐ మల్లేశ్వరి, సహాయ కార్యదర్శిగా ఎం విజయ శ్రీ ఎన్నిక అయ్యారు. ప్రాజెక్ట్ కమిటీ గౌరవాధ్య క్షులుగా చిరువోలు జయరావు వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

'మీకోసం' అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం మీకోసం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, నాణ్యత ప్రమాణాలు విధిగా పాటిస్తూ ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో జిల్లా ఇన్చార్జి కలెక్టర్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీ సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సి ఎస్ టి సి శ్రీదేవి, ఆర్డిఓ స్వాతి, మెప్మా పిడీ సాయిబాబుతో కలిసి మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాలను ప్రజల నుండి అర్జీలను స్వీకరి ంచారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 26,325 అర్జీలు స్వీకరించగా అందులో 22,712 అర్జీలు పరిష్కరించారని మిగిలిన అర్జీలు, మరల తెరచిన దరఖాస్తులు మొత్తం 1,644 అర్జీలు ఇంకను పరిష్కరించాల్సి ఉందన్నారు. వాటిని తక్షణమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. జడ్పీ సీఈఓ కే. కన్నమ నాయుడు, డ్వామా, డి ఆర్‌డిఎ పి డిలు శివప్రసాద్, హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు, పంచాయతీరాజ్ ఎస్.ఈ రమణ రావు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీలు వేగవంతంగా పరిష్కరించండి : ఎస్‌పి

మీకోసంలో వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. మొత్తం 38 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు చర్యలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అధ్యక్షతన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎం ఎం ఎస్ వై) పథక జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మత్స్య, వ్యవసాయ, నీటిపారుదల, డి ఆర్ డి ఏ, గిరిజన, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులతో పీఎం ఎం ఎస్ వై పథక పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో పీఎం ఎం ఎస్ వై పథకంలోని వివిధ పథకాలకు సంబంధించిన 83 మంది లబ్ధిదారుల దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. దీనితో పాటు సముద్ర తాబేళ్ల సంరక్షణకు సంబంధించిన 62 మెకనైజ్డ్ పడవలకు సంబంధించి 13 టర్టిల్ ఎక్స్ క్లూడర్ డివైస్ దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో మత్స్య శాఖ అధికారి ఏ .నాగరాజ, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, డిటిడబ్ల్యూఓ ఫణి ధూర్జటి, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు వారి సమస్యల పరిష్కారంలో తగు న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న ఔత్సాహికులు పారా లీగల్ వాలంటీరులు (న్యాయ సేవ కార్యకర్తలు)గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న యువతీ యువకులు ఆగష్టు 5వ తేదీ లోపు తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, కషా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి తెలిపారు. పారా లీగల్ వాలంటీర్స్ స్థానిక సమాజానికి న్యాయ సహాయం అందించటంలో సహకరించాలని, సమాజంలో సామాజిక చైతన్యం కలిగించటంతో పాటు న్యాయ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. తమ సేవలకు పారితోషికం ఆశించకూడదన్నారు. కనీసం పదవ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను వచ్చే నెల ఐదో తేదీలోపు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయ సేవా సదన్ భవనం, జిల్లా కోర్ట్ కాంప్లెక్స్, మచిలీపట్నం చిరునామాలో అందించాలని కోరారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండల గ్రామాల లోని రైతులకు సకాలంలో యూరియా మొదలు ఎరువులు అందించాలని రైతు సం ఘం మండల కార్యదర్శి శివశంకర్‌రావు, కౌలు రైతు సంఘం మండల నాయకులు నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ వెనుక గల మండేపూడి నాగభూషణం భవనంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో పది సొసైటీలు ఉన్నాయని, వాటిలో రెండు సొసైటీలో మాత్రమే ఎరువులు అందుబాటులో ఉన్నయన్నారు. రైతులు, కౌలు రైతులు వరి నాట్లు వేసి ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారని, అన్ని సొసైటీలలో ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సొసైటీలకు ఎరువుల లోడ్ రాగానే పెత్తందారులు ట్రాక్టర్లు పెట్టి వెంటనే సొసైటీలలో ఖాళీ చేస్తున్నారని దీనివలన చిన్న సన్న కారు రైతు కౌలు రైతులు ఎరువులు అందక ఏమి చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారన్నారు.



సిసి రోడ్లు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వర్ల కుమార్ రాజా

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధి గొల్వేపల్లిలో 35.10 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎనిమిది రోడ్లను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలను అభివద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళికతో ముందుకు వెళుతుందని అన్నారు. దీనిలో భాగంగా చిన్నచిన్న పల్లె గ్రామాలలో సైతం సిసి రోడ్లను నిర్మించేందుకు కషి చేస్తున్నామన్నారు. దీనితోపాటు పారిశుద్ధ్యం డ్రైనేజీ వ్యవస్థలను కూడా మెరుగుపరిచేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కష్ణ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్ ,పామర్రు మార్కెట్ యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

మొబైల్ పాస్‌పోర్టు కేంద్రం ద్వారా 32 మందికి స్క్రీనింగ్

ప్రజాశక్తి-మొవ్వ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో సోమవారం నిర్వహించిన పాస్పోర్ట్ ప్రత్యేక శిబిరం ద్వారా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన 32 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. పాస్పోర్ట్ సేవలు సులభతరం చేసి గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరింప చేయడానికి వీలుగా పర్యాటక కేంద్రమైన కూచిపూడిలో నిర్వహించిన ఈ క్యాంపు పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించి ప్రభుత్వ అభివద్ధిని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి దంపతులు, కళా పీఠం ప్రిన్సిపాల్ (పూర్తి అదనపు బాధ్యతలు) డాక్టర్ ఎం శ్రీనివాసరావు, అసిస్టెంట్ పాస్పోర్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, తహసిల్దార్ కే మస్తాన్, మండల పరిషత్ పరిపాలన అధికారి ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని గంజివానిపాలెం గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మోపిదేవి మండల టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడుకుదుటి జనార్దన్ రావు, మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : చల్లపల్లి 73వ బూత్ లో నిర్వమించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ ంలో టిడిపి కార్యకర్తలు నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతత్వంలో కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ, అభివద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, మోర్ల రాంబాబు, పైడిపాముల కష్ణకుమారి, కోట విజయ రాధిక తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలో నీ1,2,5 వార్డులలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు రెండవ వార్డులోని బీసీ కాలనీలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలు అభివద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్ర సుధాకర్, బం డే రాఘవ, పర్చూ రి దుర్గాప్రసాద్, బండే కనకదుర్గ, ఘంటసాల రాజమోహన్రావు, విశ్వనాథపల్లి పాప, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా1,5 వార్డులలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించినకార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరం ఆదినారాయణ, డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఎఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, జనసేన నాయకులు గుడివాక శివరావు తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు. **ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : (గన్నవరం)** : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బు జమ చేసిన సంగతి గుర్తు చేశారు.రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయ్యాల రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్ రాష్ట్ర తెలుగు రైతు నాయకులు గుండపనేని వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరా తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో...



మోపిదేవి మండలంలో...

ఎక్మోపై వైద్య సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ ఫార్చ్యూన్‌లో మాస్టరిన్ ఎక్మో అనే అంశంపై నిరంతర వైద్య విద్యా సదస్సు జరిగింది. ఈ సదస్సును మణిపాల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సునీల్ కారంత్, కార్డియో వాస్కులర్ సర్జన్ డాక్టర్ దేవానంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు కూడా నిరంతరం విద్యార్థి లాగా కొత్త అంశాలు నేర్చుకోవాలన్నారు. వైద్య నిపుణులు వైద్య రంగంలో వస్తున్న కొత్త విధానాల గురించి తెలియచేస్తారని అన్నారు. ముఖ్యంగా ఎక్మో గురించి తెలియచేయడంతో పాటు నూతన వైద్య విధానాల గురించి నిపుణులు తెలియచేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

'మిట్టల్' నూతన ఉత్పత్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిట్టల్ స్టీల్ సంస్థ సిజిఎల్ పేరుతో అత్యాధునిక నిరంతర గాల్వనిజింగ్ లైన్‌ను ప్రారంభించినట్లు సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దిలీప్ ఊమెన్ తెలిపారు. ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఆధునిక గాల్వనిజింగ్ లైన్ ద్వారా కంపెనీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఇది అభివృద్ధి చెందుతున్న వాహన వినియోగాలకు అసాధారణ భద్రత, మన్నిక, స్థిరత్వానికి అవసరమైన విధంగా ఉంటుందన్నారు. అడ్వాన్స్డ్ హై స్ట్రెంట్ స్టీల్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఎప్పటికపుడు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు నూతన విధానాలను అవలంబిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో 'నాగార్జున' విద్యార్థికి ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో 'అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్' వారు నిర్వహించిన ఏపీ స్టేట్ ఇంటర్ డిస్టిక్ సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లో నాగార్జున హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి జి.సోమేశ్వర్ 2వ బహుమతి సాధించాడు. సోమేశ్వర్‌ను సోమవారం పాఠశాల స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్.కృష్ణయ్య, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



కోటక్ కొత్త ఈక్విటీ స్కీమ్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కెఎంఎఎంసి/కోటక్ మ్యూచువల్ ఫండ్) కొత్త ఈక్విటీ స్కీమ్‌ను ప్రారంభించిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిలేష్ షా తెలిపారు. నగరంలోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది ఒక ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ స్కీమ్‌గా ఉండే 'కోటక్ యాక్టివ్ మొమెంటం ఫండ్' అన్నారు. ఈ ఫండ్ ఆంతరంగికంగా అభివృద్ధి చేసిన ప్రత్యేక మోడల్ ఆధారంగా ఆదాయ వృద్ధి చూపుతున్న షేర్లను గుర్తించి వాటిలో పెట్టుబడి పెట్టే లక్ష్యంతో రూపొందించామని తెలిపారు. ఈ స్కీమ్ పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్‌కు జూలై 29, 2025 నుంచి ఆగస్టు 12, 2025 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ధరలు పెరుగుతున్న స్టాక్‌లను (మొమెంటం ఇన్వెస్టింగ్) కొనుగోలు చేయడం ద్వారా లాభాలు పొందాలనే వ్యూహం అన్నారు. అయితే కేవలం ధరలపై మాత్రమే కాకుండా, ఆదాయ అంచనాలు, విశ్లేషకుల అభిప్రాయాలు, సానుకూలంగా ఉన్న స్టాక్‌లను ఆధారంగా చేసుకుంటుందని పేర్కొన్నారు. బజార్ క్యాపిటలైజేషన్ ప్రకారం టాప్ 250 స్టాక్‌ల నుంచి దృఢమైన ఫిల్టర్‌లు వేసి, నాణ్యతలేని స్టాక్‌లను తొలగించి, 40 నుండి 50 వరకు నాణ్యమైన స్టాక్‌లతో కూడిన డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో రూపొందించబడుతుందని తెలిపారు.

చారిత్రక కళ కొండపల్లి బొమ్మ



- అలనాటి కళకు అరుదైన గౌరవం
- కొండపల్లి బొమ్మకు సముచిత స్థానం
- మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 16వ శతాబ్దం నాటి ఆర్య క్షత్రియులుగా పిలవబడే రాజస్థాన్ నుంచి వలస వచ్చిన బొమ్మల నిపుణులు తమ కలను కొండపల్లి కోటలో ప్రదర్శించారు. 400 ఏళ్ల సాంప్రదాయం తరాల వారీగా బొమ్మలను రూపొందించడంలో ముందున్నారు. అలనాటి చారిత్రక సంపదగా నిలిచిన కొండపల్లి బొమ్మలను జియోటియు రొటీన్ ప్రామిస్ అనే శాస్త్రీయ నామంతో పిలవబడే తెల్ల పోనికి చెక్కతో అందంగా తయారుచేస్తారు. ఈ కలప కొండపల్లి ప్రాంతానికి సమీపంలోని గంగినేని ఎడ్లపాడు కొండూరు చెవుటూరు మరియు మాధవరం అడవుల నుండి కళాకారులు తీసుకొస్తారు. ఈ బొమ్మలకు వేసే సహజమైన రంగులను వేయడంలోనూ చమక్కు దాగి ఉంది. ఈ బొమ్మలకు మక్కు కొరకు చింతపండు గింజల పొడి, రంప పొడి జిగురు పేస్టు, సుద్ద, తెమ్మజగురు, తదితర పదార్థాల్ని ఉపయోగిస్తారు. కరక్కాయ మోదుగా మొదలైన మొక్కల సారాల నుండి స్థానికంగా లభించే పదార్థాల నుండి సహజరంగులను తయారు చేస్తారు. బొమ్మలకు రంగులు వేయడానికి వినియోగించే బ్రష్లు మేక వెంట్రుకలతో తయారుచేస్తారు. బొమ్మలను అందంగా చెక్కడానికి బహుదర అనే ప్రత్యేకమైన పరికరాన్ని ఉపయోగిస్తారు. కొండపల్లి బొమ్మ తయారు చేయడానికి తెల్ల పునికి చెట్టుని ముక్కలుగా కత్తిరించి కావలసిన సైజులలో వాటిని తయారు చేసుకొని అనంతరం కావలసిన బొమ్మ ఆకృతిలోకి వాటిని మృదువుగా నైపుణ్యంతో బహుదర పరికరాన్ని ఉపయోగించి అందంగా చెక్కిన అనంతరం మొదటగా మక్కు వేసి, పైన మరల సహజరంగులతో కోటింగ్ వేస్తారు. ఇంత చక్కని ప్రక్రియ గలిగిన కొండపల్లి బొమ్మ కళాత్మకంగా తయారు కావడానికి బొమ్మల కళాకారులు ప్రతిభ దాగి ఉంది.



కళకు తగ్గిన ఆదరణ

ఇంతటి విశిష్టత కలిగిన కొండపల్లి బొమ్మ తరాలు మారే కొద్ది కళాకారుల పరిస్థితి దయనీయంగా తయారవడంతో ఆదరణ తగ్గింది యాంత్రిక బొమ్మలు మార్కెట్లో రావడంతో ఈ కళాకారులు నిర్లక్ష్యానికి గురయ్యారు. చాలామంది చేతులతో వారు, వారి పిల్లలు ఇతర లాభదాయకమైన ఉద్యోగాల కోసం తమ వృత్తిని వదులుకుంటున్నారు. ముఖ్యంగా ఇక్కడ అటవీ ప్రాంతంలో తెల్లపునికి చెట్టు జాడ తగ్గిపోవడంతో ప్రస్తుతం కళాకారులు పలుచటి ప్లైవుడ్ చెక్కలతో తయారు చేసే పరిస్థితి వచ్చింది. అలనాటి ఆ కళకు మెరుగులు దిద్దినందుకు ప్రస్తుత ప్రభుత్వం ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఎక్స్పీరియన్స్ సెంటర్లో బొమ్మల తయారీ విధానం తెలిపే విధంగా బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏది ఏమైనా ఎన్నో ఏళ్లుగా కొండపల్లి బొమ్మల పైనే జీవనం కొనసాగిస్తూ కలని కాపాడుతున్న బొమ్మల కళాకారులకు తెల్ల పునికి చెట్టు సరిగా అందుబాటులో లేకపోవడంతో, ప్లైవుడ్ తోనే బొమ్మలను తయారు చేయడం వలన సాంప్రదాయంగా వస్తున్న కొండపల్లి బొమ్మ కళ భవిష్యత్తులో అంతరించే అవకాశం ఎక్కువగా కనబడుతుంది. కొండపల్లి బొమ్మకు ప్రాణం పోస్తున్న తెల్ల పునికి చెట్టును ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం పెంచి బొమ్మల కళాకారులకు సబ్సిడీపై అందిస్తే అలనాటి కళకు జీవం పోసినట్లు అవుతుందని స్థానికులు చెప్తున్నారు.

ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వల్ల ప్రయోజనం ఉంది : ఉదయగిరి నాగరాజు, బొమ్మల కళాకారులు

'కొండపల్లి బొమ్మల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ఏర్పాటు చేస్తున్న ఎక్స్పీరియన్స్ సెంటర్ వల్ల ఉపయోగం ఉంటుందని భావిస్తున్నాం. అయితే ప్రభుత్వం కళాకారులకు వారు తయారు చేసే బొమ్మలను తయారు చేయడానికి కావలసిన మెటీరియల్ కొనుక్కునేందుకు రాయితీలు అందిస్తే మరింత ప్రోత్సాకరంగా ఉంటుంది'



ఎన్నో ఏళ్లుగా బొమ్మలే జీవనాధారం : నాగ చారి, బొమ్మల కళాకారుడు

ఎన్నో ఏళ్లుగా కొండపల్లి బొమ్మలు మీదనే ఆధారపడి జీవిస్తున్న మాకు బొమ్మల అమ్మకానికి కావలసిన ఏర్పాట్లు చేస్తే ఎక్కువ ఉపయోగ కరంగా ఉంటుంది. అలాగే కొండపల్లి ఖిల్లా సందర్శించడానికి వచ్చే ఈ యాత్రికులకు కొండపల్లి వైపుగా రహదారిని ఏర్పాటు చేయడం ద్వారా కొండపల్లి బొమ్మలు అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించి కొండపల్లి వైపు నుండి కిల్లాకు దారి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

పురుగుమందుల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నవేళ సమృద్ధిగా ఎరువులు, పురుగు మందులు ఉన్నాయని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రస్తుతం 9,976 మెట్రిక్ టన్నుల యూరియా, 2,457 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,157 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 14,197 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే ఇలా మొత్తం దాదాపు 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కంచికచర్లలో సోమవారం ఆయన పలు ఎరువులు, పురుగు మందులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణంతో పాటు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలించారు. ఎరువులు గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఫిజికల్ స్టాటస్‌ను ఆన్‌లైన్ రికార్డులతో సరిపోల్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల సరఫరాపై అప్రమత్తంగా ఉన్నామని, క్షేత్రస్థాయిలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. కృత్రిమ కొరతను సృష్టించడం, ఎరువులను అధిక ధరలకు అమ్మడం, అడిగిన ఎరువును కాకుండా వేరే ఎరువును ఇవ్వడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని, స్పష్టం చేశారు. ఎరువులు, పురుగు మందులపై ఫిర్యాదులు లేదా సమాచారం



అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి సాగు విధానాలు దిశగా వారిని మళ్లిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక రాబడులు, ఆదాయాలు వస్తాయన్నారు. ఇష్టమొచ్చినట్లు రసాయన ఎరువులు ఉపయోగిస్తే భూ సారం క్షీణిస్తుందని, పర్యావరణానికీ ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, అగ్రి ఏడీ శ్రీనివాస్, ఏవో విజయ్ కుమార్, తహశీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్య బీమాపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆరోగ్య భీమా పొందేందుకు వృద్ధులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని, బీమా తీసుకోవడం వల్ల కంటి సంరక్షణ నాణ్యత పెరుగుతుందని, ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు, డాక్టర్ రాజ్ నారాయణ్ అన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. క్యాటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధుల్లో కేవలం ముగ్గురు మాత్రమే ఆరోగ్య బీమా కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ బీమా కవరేజ్ కూడా వయసు పెరిగే కొద్దీ తగ్గుతుందని అన్నారు. ఆయుష్మాన్ వంటి ప్రభుత్వ పథకాలు ప్రవేశ పెట్టటం ద్వారా బీమా తీసుకోవడాన్ని గణనీయంగా పెంచాయని, ఇది ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ విధానం సానుకూలతను ప్రదర్శించటమే కాక నిరంతర బీమా కవరేజ్‌కి నిదర్శనం అన్నారు. క్యాటరాక్ట్ చికిత్స తర్వాత మెరుగైన దృశ్య ఫలితాలు బీమా కవరేజ్ పైన ఆధారపడి ఉంటాయని, ప్రైవేట్ బీమా రోగులతో పోలిస్తే ప్రభుత్వ బీమా తీసుకున్న రోగులు చికిత్స కోసం అనుమతి రావటం కోసం కొద్దిరోజులు వేచి ఉండాల్సిన సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

కవికాలమ్

నా అక్షరాలు

ప్రణవాక్షరాలు కావు
అగ్రహారాల్లో పుట్టలేదు
తలుకు బెలుకులు లేవు
మహా గ్రంథాలు కావు..

ఏ దళిత వాడల్లోనో
పేద గుడిసెల్లోనో
ఒంటరితనంలోనో
చీకటి గదుల్లోనో
పురుడు పోసుకొన్న
పుణ్య మూర్తులవి...

వాటికి కష్టాలు తెలుసు
కన్నీళ్లు తెలుసు
బతకడం తెలుసు
బతికించడం తెలుసు...

తల తెగి పడిన చోట
తల మొలిపించటం తెలుసు

నా అక్షరాలు
ఎగిసి పడే కల్లోల తరంగాలు

నా అక్షరాలు
కణ కణ మండే నిప్పు రవ్వలు

నా అక్షరాలు
జాతిని నిర్మించే నీతి సూత్రాలు

నా అక్షరాలు
మట్టి వాసనతో పరిమళించే
మొగలిపూవుల వనాలు..!!

- నాగరాజు జలసూత్రం